


మాది చాలా గొప్ప వంశం. మా పూర్వీకుల గొప్పతనాన్ని తల్చుకుంటే ఈ నాటికీ వొళ్ళు గగుర్పొడుస్తుంది.

మా తాతగారు దివ్యోత్తమమనిషి. కండలు తిరిగిన దండలూ, ఇంతింత పెద్ద గుబురు మీసాలూ. చాలా గంభీరంగా వుండేవాడు. మా వూరికి ఆయనే కరణంగారు. గ్రామస్తులందరికీ ఆయనంటే హడల్. ఆయనకు మాలపల్లెలో వొకతె, మాదిగ గూడెంలో ఒకతె- ఇద్దరు ముండలుండేవారు. ముండల్నుంచుకోవటం ఆ రోజుల్లో గొప్పమరి.

ఊళ్లో పోరంబోకులన్నీ అంతకు మునుపు అన్నీ ఆయన అజమాయిషీలోనే వుండేవి. మాల మాదిగలంతా మా పొలాల్లో వెట్టిచాకిరీ చెయ్యాల్సిందే.

ఇప్పుడు మా అన్న పొలాల్లో చాలా భాగం మా తాతగారు గడించి పెట్టినవే.

ఆయన ఎదుట ఎవరూ నోరెత్తి మాట్లాడటానికి వీల్లేదు. అంతా చెప్పుకింద తేళ్లలా అణిగి మణిగుండాల్సిందే. ఆయన తీరు అట్లాంటిది.

మా తాతగారి విషయం చెప్పావా! మా తాతగారికి ఎందుకూ ఏ మాత్రం తీసిపోరు మా నాన్నగారు. ఆయన హయాంలో అయిదు కరణీకం చేశారు. మా వూళ్ళో రామాలయం కట్టించింది మా నాన్నగారే. అంతకు ముందు ఊళ్లో రామాలయం లేదు. మా నాన్నగారికి శ్రీరామచంద్రుడంటే మహాభక్తి. రాముడాయనకు స్వప్నంగా కలలో కన్పించి నాకు మీ ఊళ్లో గుడి కట్టించు అని చెప్పాట్ట. వెంటనే ఆయన పూనుకుని రైతుల దగ్గర్నుంచి ఆ రోజుల్లోనే పదిహేను వేలరూపాయలు పోగుచేసి రామాలయం కట్టించారు. రామాలయం కట్టటం, నా చిన్నతనంలోనే అయినా, ఇప్పటికీ బాగా గుర్తుంది. పాలరాతిలో అందంగా చెక్కించిన దేవుడి విగ్రహం పెట్టించారు. ఈ నాటికీ దేవుడి మాన్యాలు అనుభవిస్తూ, ఏటా శ్రీరామనవమికి ఘనంగా దేవుడి పెళ్ళి చేస్తున్నది మా కుటుంబమే.

మా నాయనగారు ఎంత గొప్పగా కరణీకం చేసేవారో అప్పటివాళ్ళు కథలుగా చెప్తారు. పిసినారితనానికి మెచ్చుకున్నారాయన్ని! పై అధికార్లు సైతం ఆయన మాట వేదవాక్కుగా పాటించేవారు. దేశంలో కరువొచ్చి తద్దర్పుడు కూలి నాలి చేసుకు బ్రతికేవాళ్ళంతా తిండిలేక అల్లాడిపోవటం చూసి, సహించలేక, స్వయంగా పూనుకుని కరువుపనిగా ఒక పెద్ద చెరువు త్రవ్వించటానికి కలెక్టరాఫీసుమీద గ్రాంటు తీసుకొచ్చారాయన. అంతేగాక మా అన్న పండేకరాల ఇంటిభూమిలో పైకట్టున్న ఆ భూమికి చెరువు త్రవ్వించటానికి తీర్మానించారాయన. ఆయన పూనుకోకపోతే ప్రభుత్వం దానికి మంజూరు చేసేదా? వసతిలేక కష్టపడేవాళ్ళు మరి. చివరికి వూళ్ళో ధాన్యం దొరక్కపోతే మా ఇంట్లో వున్న పది పదిహేను పుట్ల ధాన్యం మొత్తం కూలికింద ఇచ్చేవాడాయన. కూలింగురించి ఎవరూ తమ పట్టించుకోలేదు. ఆ చెరువు ఈ నాటి

వందెకరాలకుపైగా బీడు పడవుగా చేస్తోంది. ఎవరైనా అయినంత అద్భుతంగా చేయించే వాడు. ఆ చెరువు కట్టకు ఈనాటికీ ఒక్కసారి కూడా రిపేరు చెయ్యవలసిన అవసరం రాలేదు. ఎవరయ్యా, ఈ రోజుల్లో అంతబాగా పనులు చేయించేది? కోట్లకొద్దీ రూపాయలు తగలేసి కట్టిన కట్టిన ఆనకట్టలు ప్రారంభోత్సవం చేయు ముందే కూలిపోతున్నాయిగా.

ప్రభుత్వంలో గాని, సమర్థతలో గాని మా నాయనకు సాటిలేనేలేరని జిల్లా అంతా చెప్పుకునే వారు. ఆ రోజుల్లో ఓటూ రాజేంద్రప్రసాదంతటి వాడువచ్చి మా వూళ్లో కాంగ్రెసు మీటింగు పెడితే మా నాన్నగారి కిష్టం లేనట్టు తెలిసి ఒక్కడు మీటింగుకు వెడితే ఒట్టు. గవర్నమెంటుకి వ్యతిరేకంగా పెడుతున్న మీటింగు అది, దానికెవడూ వెళ్ళటానికి వీల్లేదు అనా రాయన అంతే. ఊళ్లో ఒక్కడైనా ఆ మాట జవదాటితే ఒట్టు. అంత సమర్థతతో ఊరిని పరిపాలించాడాయన.

* *

మా వంశీకుల గొప్పతనాన్ని గూర్చి చెప్పా లంటే ఎన్నో ఉన్నాయి. ధర్మంకోసం, గౌరవం కోసం మాట కోసం ప్రాణమైనా ఇచ్చేవంశం మాది.

మొన్నా మధ్యన ఆ విషయమే ఋజువుచేశాను. నేను మొదటినుంచి రఘురామారావుగారి కుడి భుజాన్నని జిల్లా అంతటికి తెలుసు. రఘురామారావుగారు సిండికేట్ కాంగ్రెసు నుంచి ఇండికేట్ కాంగ్రెసుకుమారి మంత్రి అయినప్పుడు నేను కూడా ఇండికేట్ కాంగ్రెసులో చేరాను. సిండికేట్ కాంగ్రెసు వారు వచ్చి ఎంత ప్రతిమాలినా అభ్యర్థిగా వచ్చే ఎలక్షన్లలో నన్నే ఎమ్. ఎల్. ఏ. గా నిలబెడతామన్నా వారి పక్షాన వుండనని చెప్పేశాను. ఒక్కటే మాట చెప్పాను వారికి. "నేనాడిన మాట తప్పను. ఆడిన మాట తప్పటం మా వంశంలోనే లేదు. నేనెప్పుడూ ఆయన పక్షాన్నే వుంటానని [illegible] ఎలక్షన్ల ముందట రఘురామారావు గారికి మాటిచ్చేను. ఇప్పటి వరకూ ఆయన పక్షాన్నే వుంటున్నాను. మీ రెన్ని చెప్పినా లాభం లేదు. మాట కంటె యమ్. ఎల్. ఏ. పదవి ఎక్కువ కాదు." ఇంకచేసేదేం లేక వాళ్ళు చేతులు నలుపుకుంటూ వెళ్ళిపోయారు. ఇదంతా ఉదాహరణ కోసం చెప్పాను గాని నా గురించి గొప్పలు చెప్పుకోవటం కాదు. తనగొప్పలు చెప్పుకునే వాళ్ళంటేనే నా కసహ్యం.

మా వంశానికి మొదటి నుంచీ భగవత్కటాక్షం ఉన్నది. మా నాన్నకు రాముడు స్వయంగా కలలో కన్పించాడా. నాకు కూడా రాముడి కటాక్షం ఉన్నట్లు చాలా కాలం క్రితమే తెల్లడయింది. మా వూళ్ళో సాంబశివరావని ఒకడు నా తూర్పు పొలం సరిహద్దు విషయంలో తగాదా పెట్టుకున్నాడు. తగాదాలూ, తిట్టుకోటాలూ అంటే నా కసహ్యమని ఊరందరికీ తెలుసు. అంచేత ఇదిగో బాబూ సాంబశివరావూ మనం మనం తగాదా పడటం ఎందుకు. ఒకరితో తగాదా పడటం నా గౌరవానికే భంగం. నేనెప్పుడూ తగాదాల్లో తిరిగినవాడిని కాదు. ఒకరి జోలికి పోకుండా భగవంతుడి దయ ప్రకారం నడుస్తున్నవాడిని. పైన భగవంతుడు అంతా చూస్తూనే వుంటాడు. న్యాయం, అన్యాయం గమనిస్తూనే వుంటాడు. కోర్టుకు వెళదాం. అక్కడే న్యాయం లభిస్తుంది." అని చెప్పాను. కోర్టులో నాకు వ్యతిరేకంగా ఒకడన్నా సాక్ష్యం చెప్పలేదు. భగవంతుడు అలాచేశాడు అంతే. కేసు నా కనుకూలంగా కొట్టేశారు.

నాలో కొన్ని దుర్గుణాలు లేకపోలేదు. "నేను మూర్తీభవించిన సద్గుణాల కుప్పని" అని నేనం చెప్పుకోవటం లేదు. ఈ దుర్గుణాలవల్ల ఎప్పుడూ ఎంతో కొంత నష్టపోతూనే వున్నాను. అయినా మరి తప్పించుకోలేకపోతున్నాను. నాలో వున్న అన్నిటికంటె పెద్దదుర్గుణం ధర్మనిరతి. ఎక్కడన్నా అధర్మం జరుగుతుందీ అంటె నా కంటపడితే ఓర్చుకోలేను. ఎన్నికష్టాలు భరించవలసి వచ్చినా అధర్మం జరుగుతుంటె చూసీచూడ నట్టూరుకోవటానికి మనసొప్పుకోదాయె మరి. మొన్నటికి మొన్న ఏమైందనుకున్నారు. అలా యథాలాపంగా జిల్లా పరిషత్ ఆఫీసుకి వెళ్ళాను. మా వూరి హైస్కూల్లో ఒక సోషల్ టీచరు పోస్టు ఖాళీగా వుందని. అది ఒక క్రిస్టియన్ కుర్రాడికి రాసిచ్చినట్లు తెల్సింది నాకు. క్రైస్తవుడు మన మధ్యకి వచ్చి మన పిల్లలకి దేశచరిత్రా, పౌరధర్మాలు బోధించటమా! తల తిరిగిపోయింది నాకు. వెంటనే పూనుకుని మరో మంచి కుర్రాడికి ఆ ఉద్యోగం వేయించాను. దీన్ని గురించి నా తలమీద పెంట్రు కలర్ని విమర్శలొచ్చాయి. అయినా ధర్మసంరక్షణార్థం తప్పలేదు మరి.

నాలో వున్న మరో దుర్గుణం స్వగ్రామమంటే నాకున్న ప్రీతి. జననీ జన్మభూమిశ్చ... అన్నారు గదా పెద్దలు ఇక్కడ వివరించెప్పనా! అతిశయోక్తి చెప్పుకుంటున్నాననే అవకాశం వుంది. మా గ్రామంలో ఏ పనివచ్చినా నేనే కంట్రాక్టులు తీసుకొనక తప్పదు. "పెద్దలు, అనుభవజ్ఞులు మీరుండగా వేరే కంట్రాక్టర్లకు ఇచ్చుకోవటం ఏమి న్యాయమండి! అవసరమైతే స్వంతడబ్బు నాలుగొందలు ఖర్చయినా పెట్టుకోగలరు మీరు. పనులు అందంగా, గట్టిగా చేయించగలరు. ఇవన్నీ మావల్ల అయ్యేపనులేనా? మీరున్నంత కాలం మీకీశ్రమ తప్పదు' అంటారు ఊళ్ళో వాళ్ళంతా. మరింక తప్పేముంది. అన్నీ నానెత్తిన పడతాయి. నిజం చెప్పాలంటె ఇప్పటికి పది హేనువేలు స్వంతడబ్బు ఊరికోసం నష్టపెట్టుకున్నాన్నేను. ఊళ్ళోకి ముఖ్యులెవరొచ్చినా మాయింట్లోనే బస. మరి వారికి తగినట్లుగా అన్ని ఏర్పాటు చెయ్యాలా వద్దా చెప్పండి. ఇవన్నీ ఎందుకంటే మరి గౌరవం కోసమేగదా!

వూళ్లోవున్న చదువుకున్న కుర్రకారు నేనంటే కోపగించుకునే మరో దుర్గుణం నాలో వుంది లేదనటం లేదు. వున్నది వున్నట్లు ఒప్పుకోవటమే నా పద్ధతి. నాకు చదువురాని బీదరైతులంటే చాలా జాలి. అభిమానం. గవర్నమెంటు వారిచ్చిన ఎరువులు, మందులు వగైరాలన్నీ వేలిముద్ర వేయించుకుని వారికి పంచిపెడతాను. చదువుకున్న వారికేముంది? వారెలాగైనా చేసుకోగలరు. చదువుకోని వారిదేగా కష్టమంతా. అంచేతే మరి ముందు వేలిముద్రలవారి అవసరాలే చూస్తాను నేను. మరి సహజంగానే చివరికి వచ్చేసరికి ఈ కుర్రకారుకి ఆ ఎరువులూ, మందులూ మిగలక పోవచ్చుగదా అదైనా ఎప్పుడో ఒకసారి. ముందు తమ అవసరాలు చూడలేదని వాళ్ళకు కోపం సరే, నెమ్మదిమీద నిజం వాళ్ళే గ్రహిస్తారులెండి.

ఇహ మా వంశస్థులు పెద్దవారినెలా గౌరవించేదీ ఇక్కడ చెప్పటం అవసరమనుకుంటాను. మా నాన్నగారి సమక్షంలో ఉన్నప్పుడు నేనెప్పుడూ నిలబడే ఉండేవాడిని. ఆయన సమక్షంలో కూర్చొని ఎరగను. మా వాడూ అంతే, నా ఎదురుగా చేతులు కట్టుకు నిల్చుంటాడు. పితృభక్తిలో మా కులదైవం శ్రీరామచంద్రుడి తర్వాత మా వాడే ననుకోండి. ఇప్పుడు నిన్ను ఫలానా పిల్ల మెళ్లో తాళికటరా అంటె కళ్ళు మూసుకుని కట్టేస్తాడు. మా వాడికి తండ్రి మాట అంటె అంత గురి. మా వంశమంతా అంతేననుకోండి.

మా వంశం గురించి పూర్తిగా చెప్పనే చెప్పాను. అలాగే నా దుర్గుణాల గురించి కూడా చెప్పాను. ఏదీ దాచుకోవటం నాకలవాటు లేదు. నా క్కావలసింది మంచి. మర్యాద, గౌరవం అంతే వాటికోసం ధనప్రాణాలను లెక్కచెయ్యటం మా వంశంలోనే లేదు. మా వంశం గొప్పతనాన్ని బట్టి, నా గుణగణాలను బట్టి కట్నం మీరే చెప్పండి నేను మరో మాటడగను. మరో మాట మా వంశంలోనే లేదు. అవతల వారు ఎనభై ఇస్తామంటున్నా వారిది గొప్ప వంశం కాకపోవటంతో మీ దగ్గరకు వచ్చాను. నేను పూర్తిగా వంశగౌరవం చూసి వచ్చాను తప్పితే......